


# కనకరాజు మేడ

బాలి

విజయవాడ - విశాఖపట్నాల మధ్యనున్న రెల్వేజంక్షన్ అది. అక్కడ దిగి బండి మారి మీకు కావలసిన ప్రాంతానికి వెళ్ళవచ్చునన్న పసుపు రంగు బోర్డులు ఆ జంక్షన్ ఫ్లాట్‌ఫారం మీద ఆ చివరన, ఈ చివరన ఉంటాయి. జంక్షన్ కాబట్టి జనం ఎక్కువమందే ఉరకులు, పరుగులతో అటు ఇటూ తిరుగుతుంటారు. ఆ స్టేషన్ ముందున్న మట్టిరోడ్డు దాటితే ఏలూరు కాలువ. లాకులు కట్టినప్పుడు తప్ప ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. అటు వేపు ఊర్లలోకి వెళ్లాలంటే ఈ మట్టిరోడ్డు మీద అరఫర్లాంగు దూరంలో కాలువమీద ఓ వంతెన ఉంది. ఆ వంతెన దాటితే అటు వేపు మరో మట్టిరోడ్డు ఉంది. ఆ వంతెన ప్రయాణీకులతో విపరీతమెన రద్దీగా ఉంటుంది. పైగా అది ఇరుకైన వంతెన.

యేచలం, మాచారం, కుమ్మరాపల్లి, రజాల, జంగాలపాలేలకు వెళ్లాలంటే ఈ రోడ్డుమీదే గుర్రపు బళ్ళుగానీ, ఒంటెద్దు బళ్ళుగానీ కట్టించుకోవాలి. స్టేషన్‌లో ఏదన్నా బండి ఆగిందంటే ఈ బళ్లవాళ్ల కేకలు మిన్నుముడతాయి. అయితే స్టేషన్ లోపలికి రారు. స్టేషన్‌లో పోర్టర్లకూ వీళ్లకూ ఈ విధమైన కట్టుబడి ఉంది. ఈ మధ్య ఈ చిన్నవంతెనకు ఇరువేపులా పెద్దపెద్ద చెట్లు బలిశాయి గానీ జాగ్రత్తగా గమనిస్తే ఈ మట్టి రోడ్డు వెనక విశాలమైన మైదానం కనపడుతుంది. ఆ మైదానం అంచున ఎత్తయిన పెద్దపెద్ద గోడలతో, ముందువేపు నల్లటి రంగు వేసిన పెద్దగేటులో, ఆ గేటుకి పైన రెండువేపులా వెండి రంగు వేసిన ఇటాలియన్ వాస్తుతో చేసిన అమ్మాయిల బొమ్మలతో రెండంతస్తుల కోటలాంటి పెద్దమేడ కనిపిస్తుంది. 'ఎప్పుడో తప్ప మనుషుల అలికిడి కనపడదు అందులో. ఆ నల్ల గేట్లు తెరవబడవు. ఎవరన్నా రావడం పోవడం ఆ మేడకు కుడివేపున మరో చిన్నద్వారం గుండానే. అదే కనకరాజు మేడ.

లేదా కనకరాజుగారి మేడ అంటారు స్థానికులు.

వంతెనముందు మొదలైన ఆ మట్టిరోడ్డు మైదానం అంచుల నుండి, కనక రాజు మేడకు, ఓ పక్కన తిరిగి వెనక ఉన్న గ్రామాలకు వెళ్లిపోతుంది. ఆయా గ్రామాల నుండి స్టేషన్‌కు రావాలంటే ఇదొక్కటే రోడ్డు. ప్రతి శనివారం ఆ మైదానంలో చిన్నపాటి సంత జరుగుతుంది. ఆ గ్రామాల నుండి ఈ స్టేషన్‌కు రావాలన్నా, సంతకు రావాలన్నా ఈ జట్కావాళ్లు స్టేషన్ పేరు పెట్టి పిలవడం కన్నా కనకరాజు మేడకీ, కనకరాజు మేడకీ అని అరుస్తారు. అలా అరవడం అలవాటయిపోయింది.

కనకరాజుగారి పూర్వీకులు చెన్నపట్నంలో ఉండి బర్మాటేకు వ్యాపారం చేసేవారట. కొన్ని కారణాంతరాల వల్ల ఆ వ్యాపారం పక్కనపెట్టి ఇక్కడికి

దగ్గర్లో ఉన్న సోంపల్లి అగ్రహారం చేరుకున్నారట. ఇప్పటికీ వారికి ఆ వూర్లో ఓ యాభై ఎకరాల పంట భూములున్నాయి. రాజకీయపార్టీ అయిన జస్టిస్ పార్టీలో కొన్ని సంవత్సరాలు చురుకైన పాత్ర నిర్వహించ డం వల్ల ఆయన చుట్టూ పార్టీ కార్యకర్తలు ఎప్పుడూ ఓ పాతికమంది దాకా పర్యవేష్టితులవడమే కాదు. ఉద్దండులూ, ప్రసిద్ధులయిన రాజకీయ నాయకులు ఆ మేడలో బస చేసే వారని చెప్పుకుంటారు. ఇవికాక రైల్వే కాంట్రాక్టు పనులు చేసేవారు. అందుకు ఆయన ఇల్లు అందరికీ అందు బాటులో ఉంటుందని రైల్వేస్టేషన్‌కు దగ్గరగా కట్టించుకున్నారు.

ఆయన పార్టీలో చురుగ్గా పాల్గొనన్నాళ్లూ ఆయనకు తిరుగు లేదట. రేపు వచ్చే ఎలక్షన్లలో నిలబడుతున్నానూ అంటే చాలూ, పుంగా పట్టుకొని వీధిలోకి ప్రచారానికి రానక్కర్లేదు. ఆ పక్కా ఈ పక్కా ఉన్న పాతిక ఊళ్ల వాళ్లు ఆయనకే ఓట్లువేసి గెలిపించి ఆయన కనుచూపు పడితే చాలని తపించి పోయేవారు. ఆయన మీ ఓట్లు, వేయించుకొని ఏం మేలు చేసేరయ్యా అంటే అలా గెలిచిన వారు మేలు కూడా చేస్తారా? అని వెర్రి జనం ఆశ్చర్యపోయేవారు. ఓ పెద్దమనిషి మాత్రం పెద్దచెరువుకి ఈయనే కదూ గట్టు పోయించేడూ. అంతేకాదు ఈ స్టేషన్‌లో మద్రాసు మెయిలు, కలకత్తా మెయిలూ ఆగడానికి ఈయనేగా కారణమన్నాడు విశాల హృదయంతో.

ఏదన్నా ఉద్యోగం నిమిత్తం ఆయన దగ్గరకెళితే, ఆయనెంతో ఆప్యాయంగా భుజం మీద చేయివేసి ''ఏం చదువుకున్నావు నాయనా? మీ ఇంటి పేరేమిటీ?'' అని అడిగేవారు. నాల్గు రోజుల్లో ఏదన్నా ఉద్యోగం రావడమే లేదో తేలిపోతుంది. ఇంకెవరికన్నా ఆర్థిక సాయం కావలసి వస్తే, ఎవరూ లేరని ఏకాంతం చేసుకొని అడిగితే వారికి మొండి చెయ్యే గతి. అదే సాయాన్ని నలుగురూ ఉండగా అడిగితే డబ్బు సాయం చేయడమే కాదు, తనే స్వయంగా ఆ వ్యక్తి జేబులో కుక్కేవాడు ఆ నోట్లను.

దీన్ని కొందరు తమాషాగా ఇలా నిర్వచించేరు. ''కనకరాజేం తెలివి తక్కువోడు కాదు. భుజాల మీద చేయివేసి దగ్గరకు లాక్కున్నాడు అంటే ప్రేమ వలకపోసి కాదు. వేలితో జంధ్యం పోగు వెతికే రకం. ఇంటి పేరు అడిగేడూ, అంటే మరికొంత అనుమానం తీర్చుకోవడమన్నమాట. ఆయన వంటరిగా ఉన్నప్పుడు డబ్బు అడిగితే అదేం పబ్లిసిటీ కిందికి రాదు. నలుగురులోనూ ఆయనను ఆర్థిక సాయం కోరితే తనంత ధర్మాత్ముడు మరిలేరని గుర్తింపు తెచ్చుకోవడం, ఎవరికి తెలియదీ వెర్రి వేషాలూ అన్న వారున్నారు.

అయితే ఇంతగుర్తింపు తెచ్చుకున్న కనకరాజు గారు ఈనాడు భూమి మీద లేరు. ఆయన చనిపోయి పాతిక సంవత్సరాలు పైనే అయ్యింది.

ఆయన ఏకైక కుమార్తె కనకదుర్గ, అల్లుడు రాంబాబు, మనమలు పవన్, రామశేషు, అల్లుడు రాంబాబూ చనిపోయి పది సంవత్సరాలు అయ్యింది.

***

''వొచ్చె ... వొచ్చె... వత్తన్నానమ్మగోరూ – మెట్లు తుడుత్తున్నానా..'' పెద్ద పొలికేక. ఆ వెంటనే రేకు చాటను చీపురు కట్టనూ కిందపడేసిన శబ్దం గదిలో పరుపు మీద – భర్తకు ఓ పక్కగా పడుకున్న దేవసేన ఆ కేకలకు తుళ్ళిపడి లేచింది. ముఖమంతా ఆశ్చర్యమూ భయంతో నిండిపోయింది. కళ్ళు పెద్దవిచేసి ఎక్కడున్నాను అని చుట్టూ చూసింది. మూసిన కిటికీలు, పైనున్న రంగుటద్దపు పెంకుల్లోంచి రంగురంగులు వెలుతురు గదిలో పడుతోంది. తెల్లారిపోయిందన్న మాట! మనసు కుదటపడింది. తనెక్కడుందో తెలిసి తమాయించుకుంది.

బెడ్ రూం లైట్ గోడకు వెలుగుతోంది.

పైన ఫ్యాన్ తిరుగుతోంది. గాలికి ముంగురులూ చెదిరి నుదురు చుట్టూ అల్లుకుంటున్నాయి. రెండూ చేతులు ఎత్తి సర్దుకుంది వాటిని. మంచం మీద అటు తిరిగి నిద్రపోతున్నాడు రామశేషు. వాడి వీపు విశాలంగా తెల్లగా కనిపిస్తోంది. నడుము వరకూ ఉన్న లుంగీ, కాళ్ల దగ్గరున్న పలుచని దుప్పటీ అస్తవ్యస్తంగా పడి ఉన్నాయి. జడను ముందుకు లాక్కుంది. నలిగిన పూలూ – అందులోని దారపుపోగూ కనపడ్డాయి. మరికొన్ని పూలు వాడి మంచం మీద దుప్పటి మడతల్లో కనిపిస్తున్నాయి. అవితీసి చేత్తో పట్టుకుంది. స్టూలు మీద రాత్రి సగం తిన్న స్వీటు పాకెట్టూ, పాలగ్లాసు అడుగున కాసిన్నిపాలూ కనిపిస్తున్నాయి. మూసిన తలుపులు, వాడిన పూలు గ్లాస్ అడుగున చేరిన పాల చుక్కలతో గదంతా ఏదో వింత పరిమళం ఆవహించి ఉంది.

''ఓరి దేవుడా! ఎంత గట్టిగా అరిచిందీ సూరమ్మ'' పని మనిషిని తిట్టు కుంటూ గుండెల మీది రవికెనూ, జారిన పమిటనూ సరిగ్గా సర్దుకొని మంచం దిగింది. లంగా బొందును వేళ్లతో వెతుక్కుంటే అదెక్కడో వెనకన ఉంది. రాత్రి రామశేషు చేసినపెంకిపనులు గుర్తుకు రాగా ''ఈయనొకడూ – తెల్లార్లూ నిద్ర పోనివ్వడు. ఇప్పుడు తనకేం, పది గంటల దాకా నిద్రపోతాడూ'' అని లోలోన గొణుక్కుంటూ అద్దం ముందు కెళ్లింది. పాతకాలపు టేకు బల్లకు అమర్చిన అద్దం అది. కిందో అరడజను సొరుగులు, వేళ్లతో కళ్ల కాటుకను సర్దుకొని, దువ్వెనతో జుట్టును పైపైన సరిచేసుకొని చెంపపిన్నులు వెతుక్కుంటే అవి చెవులు వెనక కనకపడక పోయేసరికి తిరిగి మంచంలో వెతికింది. ఒకటి దుప్పటి మడతల్లో దొరికితే మరొకటి రామశేషు వీపు కింద ఉంది. అది లాగడం ఇష్టంలేక, పాల గ్లాసులో నలిగిన పూలూ, పూల చెండూ వేసి నెమ్మదిగా గడియ తీసుకొని బయటికి వచ్చింది దేవసేన.

సూర్యోదయం జరిగి చాలా సేపయినట్టుంది. ఎండ చెట్ల ఆకులు మధ్య నుండి మేడ స్థంభాల మీద చుక్కలు చుక్కలుగా పరుచుకొని ఉంది. ఎదురుగుండా ఉన్న మైదానంలో జనం హడావుడిగా పరుగులు తీస్తున్నారు. ఏదో రైలొచ్చింది కాబోలు. గుర్రపుబళ్లు వాళ్ల కేకలు వినిపిస్తున్నాయి. గేటు గోడమీది వెండి రంగుబొమ్మలు ఎండకు మెరుస్తున్నాయి. ఓ క్షణం అటుచూసి నిద్రమత్తు ఇక వదిలిందీ అనుకొని ముందు హాలు చివరి వరకూ వచ్చి మెట్టు దిగబోయింది. సూరమ్మ వదిలిన చీపుర కట్టా, రేకు చేటా అక్కడున్నాయి. అవి దాటబోతూ లంగా కుచ్చెళ్లను వేళ్లతో సుతారంగా ఎత్తి పట్టుకుంది. ఇంతలో...


**T.A. ENTERPRISE**

***Manufacturers of* : Teflon, Nylon. P.P. All Plastics and Hylam Components.**

***Dealing in* : Champion, Hindustan, Fenrodo, Reinz Talbrons, Delrin, Nylon, Hylon, Acrylic, Good Year Fanner, Dunlop, Hilton, Syndaxgo Sheets, Charminars, Rutolene Klipco, Rubber Sheets, P.V.C. P.P. H.D.P.C. Fevicol, Lacolite, Anubond, Mahindra & Mahindra, Araldite, Cutling Tobls, Fasteners, Rxnes, Hand tools, Precision, Measuring Instruments, Pipes Pipe Fittings, Welding Accessories & Food Aditives, all types of bearings & General Order Suppliers.**

**A Home of Industrial Needs.**

**Post Box No. 2067, No : 5-1-373**
**Old Ghasmandi, Ranigunj,**
**Sec-bad - 500 003**

''ఏమిటీ? వాడింకా లేవలేదూ!'' అంటూ కనకదుర్గ వచ్చింది. తల స్నానంచేసింది కాబోలు. తలకి తువ్వాలు చుట్టుకున్నా తడిసిన వెంట్రుకలు భుజాలమీద కనపడుతున్నాయి. కనుబొమ్మల మధ్య విభూతిరేఖ. వంటికి చుట్టుకున్న గోచీ పోసిన కంచి పట్టుచీర. చేతిలో ఉన్న వెండి పళ్లెంలో, ఉద్ధరిణెలో ఉన్న వెండి గిన్నె అగ్గిపెట్టె, అగరొత్తులూ, పూలు ఉన్నాయి.

ఆమె ముఖంలో సన్నటి నవ్వు.

మనిషి ప్రశాంతంగా ఉంది. గొణుక్కుంటున్నట్టు నారాయణ స్తోత్రం చదువుతోంది.

''పడుకున్నారు'' అంటూ చప్పున అత్తగారికి అడ్డు రాకుండా పక్కకు తప్పుకుంది దేవసేన.

కనకదుర్గ మెట్లెక్కి వరండాలోకి వెళ్లిపోయింది. ఆ వరండాకు మరో పక్క ఆమె నిత్యం ఆరాధించే తులసి మొక్క ఉంది. అదొక్కటే కాదు. మొత్తం ఆ మేడలో అరడజనుకు పైగా తులసి మొక్కలు గోలేలతో ఉన్నాయి. వాటిన్నిట్నీ చూసుకొని, కింద హాల్లో నిలువెత్తు ఫొటోలయి పోయి ఉన్న భర్త రాంబాబు, తండ్రి కనకరాజుగార్ల ఫొటోలకు నమస్కరించి అగరొత్తులు వెలిగిస్తేగాని ఆమె ఉదయపు ఫలహారం ముట్టదు.

ఆమె వెళ్తున్న వేపే దేవసేన చూసింది. ఇంత వయసున్న అత్తగారు చాలా అందగత్తెగా, ఆరోగ్యవంతురాలిగానే ఆమెకు కనపడింది. సన్నటి నడుమూ, ముదురు ఆకుపచ్చరంగు, కంజీవరం కింద ఆమె తెల్లని శరీరం పిక్కలు కనిపిస్తున్నాయి. మనిషెంతో చురుకు. ఈమె వయసులో ఇంకెంత అందంగా ఉండేదో అనుకొంది.

మెట్లు దిగుతూ చేతిలోని పాలగ్లాసు, అందులో వాడిన పూలూ, పళ్లెం వంకా చూసింది. పళ్లెంలో తీపి బూందీ తునకలున్నాయి. వాటిని మెట్ల మీద నుండి వీధిలో వంచుతూ మైదానం చివరలో గల రోడ్డు వంపులో ఏదో గోల జరుగుతూంటే అటే చూస్తూ ఉండిపోయింది. ఓ జట్కా వాలా, బండెక్కిన వారితో ఏదో గొడవపడి ఆపేశాడు. ఆ వెనక ఉన్న మరో జట్కా వాలా వీడికి సపోర్టు.

వీళ్లు ముస్లిమ్‌ల్లా ఉన్నారు. మురికెత్తిన గళ్ల లుంగీలూ, మాటల్లో యాస, జులపాలూ చేతికి నల్లని తాళ్లూ, పెద్ద పొలికేకలు, వీళ్ల కేకలకీ, బరువైన సామాన్లు కింద ఎత్తి పడేస్తున్న చప్పుళ్లకీ గుర్రాలు బెదురుతున్నాయి.

''ఇంకా ఇక్కడే ఉన్నావేమిటీ?'' వెనకనుండి మెట్లు దిగుతూ అత్తగారు కనకదుర్గ పిలుపు.

''ఏదో గొడవ పడుతూంటే..''

''ఎప్పుడూ ఉండేదేలే!'' అయినా ఏమిటా చూపు. కిందకు పోయి మొహం తొలుచుకోవద్దూ. ఫలహారం చల్లారి పోతుందని జానకమ్మ కేకలు వేస్తుంది''.

కొంగు తగలకుండా అసింటా మెట్లు వేపు జరిగి కనకదుర్గ చకచకా మెట్లు దిగి వెళ్లిపోయింది.

కనకదుర్గ ముఖంలో ఇందాకటి ప్రశాంతత లేదు. ఏదో విసుగు. క్షణంలో రంగులు మారిన ముఖం.

దేవసేన మనసు అదోలా అయిపోయింది. ఏదో ఆలోచిస్తూ ఆమె వెనకనే మెట్లు దిగి వెళ్లింది.

''వస్తూ, వస్తూ అలా అప్రయత్నంగా చూడ్డం కూడా తప్పేనా? తనకు పెళ్లయి గట్టిగా ఆరు నెలలు కూడా కాలేదే? ఏదో సరదాగా... మేడమీద నుండి కిందకు... ఆ మైదానం వంక, ఆ మనుషుల వంకా చూస్తే అత్తగారి ముఖంలో విపరీతమయిన విసుగు. ఇలా జరిగి ఇది మూడవ సారి.

కిందకు పోయి ఏం చెయ్యాలట?....

ఇంటి నిండా పాతిక మంది పని వాళ్లున్నారు...

ఏ పని చేద్దామని కూచున్నా– ''ఎందుకూ – మేం ఉన్నాం కదా చిన్నమ్మ గారూ మీరలా కూచోండి'' అని వెనకనుంచి ఆ పనిని అందుకుంటేనే ఉంటారు పనివాళ్లు.

ఇక వంటచేసే జానకమ్మగారి సంగతి చెప్పనక్కర్లేదు. కొసరి కొసరి వడ్డిస్తుంది. ఇకపోతే ఏం తోచదూ అంటే తన గదిలోకి పోయి ఏ పుస్తకమో చదువుకోవాలి! ఎంతకని చదువుతాం? ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుందామంటే రామశేషు ఉదయం పోతే రాత్రికే దర్శనం ఇస్తాడు. అతని బిజినెస్ అటువంటిది. ఖాళీ దొరికిందంటే సిన్మాలకీ, షికార్లకీ తీసుకెళతాడు. అది కొంత నయం.

మరో రోజు రామశేషు ఏదో పేపర్ చదువుతూ మధ్య మధ్య పిట్టగోడకు ఆనుకొని ఉన్న దేవసేనతో కబుర్లు చెప్పి నవ్విస్తున్నాడు. దేవసేన పగలబడి నవ్వుతూ మైదానం వేపు చూస్తోంది.

సరిగ్గా అదే సమయంలో కనకదుర్గ అటు వచ్చింది. ''ఆ చెప్పే కబుర్లేవో, వాడి పక్కన కుర్చీ వేసుకు కూర్చుని వినరాదటే –'' బయటకు చూస్తావు – అక్కడేం బొమ్మలాడుతున్నాయనీ'' అంది ఆ మాటలకు దేవసేన గతుక్కుమంది.

ముఖంలోని సంతోషం అంతా ఎగిరిపోయింది. రామశేషు తన ధోరణిలో తాను చెప్పుకుపోతున్నాడు.

''ఈ బయటకు చూడ్డం'' అన్నమాట అత్తగారి నోట చాలాసార్లు విన్నది. తను ఆ మైదానం వేపు చూడ్డం అప్రయత్నమే కావచ్చు. ఎందుకో ఆమె ఆ విషయాన్నే తరచూ దెప్పడం, హెచ్చరించడం – తన మనసు బాధతో మూలిగింది.

తాను చేసిన నేరమేమిటి? ముఖం మరోపక్కకు తిప్పుకొని గదిలోకిపోయి కుర్చీతో పాటు, నవల తెచ్చుకొని పేజీలు తిరగేస్తు కూచుంది ఆ పక్కనే.

నెల రోజులు గడిచి ఉంటాయి.

కనకదుర్గ ఊరెల్లింది. దేవసేన పెరట్లోంచి వస్తోంటే జానకమ్మ ఒక్కర్తీ వంట గదిలో కనపడింది. ఆవిడకు దగ్గరగా పీట వేసుక్కూచుని కబుర్లు మొదలెట్టింది దేవసేన. జానకమ్మ అంత ఆప్యాయంగా మాట్లాడుతూ ఏ కూర ఎలా వండితే రుచితో పాటు, ఆరోగ్యానికి ఎంతమంచిదో చెప్పటం మొదలెట్టింది. ''నీకేం కావాలో చెప్పవే! వండి వడ్డిస్తానూ! నేనేం ఈ వంటగదిలో కష్టపడి పోవడంలేదులే! కూరలూ, నారలూ తరిగి ఇవ్వడానికి అదిగో ఆ పని వాళ్లున్నారు. పోపు వేసి, ఉప్పూ, కారమూ సరిగ్గా వెయ్యడమే నా పని. కనకదుర్గ సరేసరి. చాలామంచిది. దేనికీ వంపు పెట్టదు. అప్పా, చెల్లెళ్లా ఇన్ని సంవత్సరాలూ కలిసిపోతున్నాం. మీ మావగారు చనిపోయి ఏ లోకాన ఉన్నారో గానీ, నా వంటను అమృతంలా తినే వారనుకో. సరిసరి ఆ మాటలు కేం గానీ. మాకో మన వడ్ని తొరగా కనివ్వవే'' అని ఫకాలున నవ్విందామె.

దేవసేన సిగ్గుతో మొగ్గఅయ్యింది. జానకమ్మ గారి మంచితనం ఇదీ అనుకుంది మనసులో.

ఆమె చనువును గమనించి ''జానకత్త గారూ! మీరు ఏం అనుకోకపోతే నాకో అనుమానం ఉంది. ఎప్పట్నించో అడగాలనుకొంటున్నాను. అడగమంటారా?'' అంది.

జానకమ్మ ఇంకా చనువుగా నవ్వి ''ఇది నీ ఇల్లు. మన మధ్య దాపరికా లేమిటి? నిర్భయంగా



అడుగు'' అంది.

తాను ఈ ఇంట్లో "కోడలిగా అడుగుపెట్టి నెలలే అయ్యింది. పూర్తిగా ఈ ఇంటి విషయాలు గానీ, పరిసరాలు గానీ ఏమీ తెలియవే! మేడ మీద నుంచి స్టేషన్ వేపు... ఆ మైదానం వేపు చూస్తోంటే అత్తయ్యగారి కెందుకీ పుల్లవిరుపు మాటలు... మిగతా క్షణాల్లో ఎంత బాగా మాటాడుతారనీ... ఈ అనుమానం ఆమె ముందుంచింది.

జానకమ్మ చాలా సేపు ముసి, ముసిగా నవ్వింది.

తరువాత దేవసేన వేపు తిరిగి ఫక్కున నవ్వింది. ఆమె ముందు రెండు పళ్లల్లో ఓ పన్నుండదు. అయినా ఆమె నవ్వులో అందముంది. పచ్చగా, కాస్తపొట్టిగా ఉన్న ఆకారం. నల్లని వొత్తయిన జుట్టు. వయస్సులో అందకత్తే అని చెప్పవచ్చు.

దేవసేన ముంగురులు ప్రేమగా సర్ది వంటిల్లు తలుపు రెక్కలు దగ్గరగా వేసి వచ్చి, ముందుకు వంగి "మీ అత్తగారు కనకదుర్గ చాల మంచిది. దాని సంగతి నీకు తెలియక అలా అనుకుంటున్నావు. సరి. ఇప్పుడు నేను చెప్పబోయే సంగతి మరెక్కడయినా పొరపాటున అనుకూడదు. మనసులోనూ మరోలా తలచకూడదు. అది కేవలం వయస్సు చేసే అల్లరికి సంబంధించినది. మంచిచెడ్డలూ భవిష్యత్తునూ ఆలోచించనీయ కుండా ఆ ప్రేమ పరిపరివిధాల పరుగెత్తిస్తుంది. ఆ అనుభవం తరువాత విచక్షణా జ్ఞానమూ, మానసిక పక్వమూ కలుగుతాయి. ప్రస్తుతం కనక దుర్గది అదే స్థితి. ఆ అనుభవంతోనే నిన్ను రక్షించబోతోంది. పెద్దలు తమ అనుభవంతోనే పిల్లల్ని ఓ కంట కనిపెడుతూ ఉంటారు. అసలు విషయమేమంటే..''

జానకమ్మ దేవసేన చేతిని తన చేతిలోకి తీసుకుంది. దేవసేనకిదంతా అయోమయంగా ఉంది. రెప్ప ఆర్పకుండా ఆమె వేపే చూస్తోంది.

"ఇది ఎన్నో సంవత్సరాల కిందటి ముచ్చట. అప్పటికి మీ అత్తగారు యుక్తవయసులోకి వచ్చింది. పైగా అందకత్తె కూడా వీధి గేటుకి చేరబడి, రైల్లో దిగే జనాలనూ, ఈ గుర్రపు బళ్లవాళ్లనూ తదేకంగా చూస్తుండేది కాబోలు చినమడక పీర్‌సాయిబు కొడుకు, ముస్తఫా అన్నవాడు దీన్ని తీయని కబుర్లలోకి దింపి, దాన్ని గుర్రపుబండి ఎక్కించుకొని ఎటో తీసుకుపోయేడట. వాడు తెల్లగా, బలంగా బావుండే వాడటలే! ఆ పోవడం పోవడం వాడు ఏ ఏ వూర్లు తిప్పాడో గాని ఓ నెల్లాళ్లు అదీ, వీడూ జనాలకి కనపడ్డం మానేశారు. ఈలోపు దీని వంటిమీది బంగారమూ కరిగిపోయిందట. పరువూ, మర్యాద ఉన్న ఈ కనకరాజు గారు బెంగతో మంచమెక్కారట. ఆయన భార్య చావుకి సిద్ధమయి పోయిందట. నెల్లాళ్ల తరువాత పీరుసాయిబు ఈ మేడలోకి వచ్చి రాజు గారి కాళ్ల మీద పడి క్షమించమని జరిగిన విషయం చెప్పాడట. ఈ విషయం నలుగురి చెవిలోనూ వేయొద్దంటూ రాజుగారి తిరిగి పీరు సాయిబు కాళ్ల మీద పడి కనకదుర్గను లోనికి తెచ్చుకున్నారట''.

గుర్రపుబళ్ల వాళ్లూ, ఆ మైదానమూ కనకదుర్గ విషయంలో చేదు అనుభవాన్ని మిగిల్చాయి. దాని ఫలితమే నిన్ను అటు చూడనీయక పోవడం.

దేవసేనకు విషయం పాలల్లో పంచదార కలిసినట్టు అర్థమయి పోతోంది. గొంతు పెగుల్చుకొని అంది. "జానకత్తా!' ఇదంతా మావగారికి తెలియదంటావా!''

"ఈ ప్రశ్న నువ్వేస్తావని నాకు తెలుసు''.

జానకమ్మ మెల్లగా అంది. చెంగుతో నుదుటి చెమటను తుడుచుకుంటూ అంది. "ఆయనది విశాలమైన హృదయం అని అనేకన్నా మన జీవితంలోకి వచ్చిన అనుభవాలు, పక్కవారి తప్పులను క్షమింప చేస్తాయి'' ఇలా చెప్తే నీ కర్థమవుతుంది.

"నా తండ్రి అమాయకుడు, పైగా దరిద్రుడు - పూట గడవడమే కష్టమయిన ఆ రోజుల్లో ఆయన గుండెల మీద కుంపటిని నేను. ఎవడో ఒకడికి నేను భార్యగా వెళ్లాలి కాబట్టి నాకో అంగవైకల్యుడూ, పుట్ట దరిద్రుడూ అయినన వ్యక్తిని నాకు భర్త స్థానంలో వచ్చాడు. నాకు పెద్దగా చదువు లేదు. వంట చేయడం తప్ప మరొకటి చాతకాదు. అదే ఈ మేడలో నాకో స్థానాన్ని కల్పించింది. నాకు మాత్రం వయస్సు రాదా? కోర్కెలుండవా? నా ముందు నుండి రాంబాబుగారు వెళ్తుంటే వెనక నుంచి తప్ప, ముందు నుంచి తల ఎత్తి చూసే ధైర్యం నాకేదీ. ఆయనది గ్రహించినట్టున్నారు. తనకు కావలసినవి వండించుకొనే వారు. వంటకమ్మగా ఉందన్న ప్రశంసలు ఎన్నో! నాకు రానురాను ధైర్యమెచ్చింది. ఆ ధైర్యంతోనే ఆయన ముందు నిలబడ్డాను. దాని ఫలితమే నా కొడుకు రమాపతి జన్మ''.

"ఆయనకు కలిగిన ఈ అనుభవమే కనకదుర్గను క్షమించేట్టు చేసిందనుకుంటాను''.


జానకమ్మ నేల వేపు చూస్తోంది.

ఏదో లక్కు వీడిపోయిన భావన. దేవసేన వెళ్లి వంటగది తలుపులు తెరచింది. చల్లటిగాలి ముఖాన్ని కొట్టింది. గబుక్కున తిరిగొచ్చి ఆమె పాదాలను తాకుతూ "జానకత్తా!'' అంది మెల్లగా. జానకి తనలో తనే నవ్వుకుని దేవసేన చేతిని తన చేతుల్లోకి తీసుకుంది.

★

రచయిత సెల్ : 98499 63082

# అపూర్వజననం...



ఒకే కాన్పులో ఇద్దరూ లేదా ముగ్గురు జన్మించడం పెద్ద విడ్డూరం కాకపోయినా, ముగ్గురు పిల్లలూ తేదీ, నెల, సంవత్సరం సంఖ్య కలిసి వచ్చేటట్టు జన్మించడం మాత్రం నిజంగా విడ్డూరమే! మిచ్‌లోని రాక్‌ఫోర్డ్‌కు చెందిన చాడ్, బార్బిలకు ముగ్గురుపిల్లలు. బార్బి తన మొదటి బిడ్డకు 8-8-2008లో జన్మనివ్వగా, రెండవ బిడ్డకు తిరిగి మరుసటి సంవత్సరం 9-9-2009లో జన్మనిచ్చింది. తిరిగి మూడవ బిడ్డ ఈ సంవత్సరం అరుదైన రోజు చెప్పబడుతున్న 10-10-2010న జన్మించింది. చాడ్, బార్బిలకు సంఖ్యాశాస్త్రం మీద నమ్మకం లేదు. అయినా వీరి ముగ్గురు పిల్లలూ నెల, తేదీ, సంవత్సరం ఒకే అంకెలో వచ్చేటట్టు జన్మించారు. మొదటి ఇద్దరు పిల్లలు ప్రసవం సమయంలో బార్బి కొద్దిగా అనారోగ్యానికి గురైంది. దాంతో అనుకోకుండా ఇద్దరి పిల్లలు పుట్టిన తేదీలు అలా కలిసివచ్చాయి. మూడవ బిడ్డ ప్రసవం మాత్రం కొద్ది రోజుల ముందుగా జరిగింది. మూడు వారాల ముందు అంటే 10-10-2010 నాడు బార్బి మూడవ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ బిడ్డ ముందు జన్మించాలని బార్బి కోరుకుంది. ఆమె ఆరోగ్యంగా ఉండడంతో వైద్యులు కూడా ఇందుకు సహకరించారు.

"ముగ్గురు పిల్లలకు ఈ విధంగా తేదీలు కలిసి వచ్చేవిధంగా జన్మనివ్వాలన్న ఆలోచన ఎప్పుడూ లేదని'' బార్బి చెప్పింది. మూడవ బిడ్డకు డెలివరీ టైము అక్టోబర్ 20వ తేదీ. అయితే ముందు పుట్టిన పిల్లలు వరుస తేదీలతో పుట్టడడంతో ఈ బిడ్డను కొద్దిగా ముందుగా జన్మనివ్వాలన తన కోరికను డాక్టరు మన్నించడంతో మూడవ బిడ్డ అక్టోబర్ పదవతేదీన జన్మించినట్లు'' తెలిపింది.

"బార్బికి ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఆరోగ్య సమస్య తలెత్తడంతో, ఆమెకు కాన్పు చేయవలసి వచ్చిందనీ, దానికి తోడు మూడవ బిడ్డకు త్వరగా జన్మనివ్వాలన్న బార్బి కోరిక మేరకు ఆమెకు ఆపరేషన్ చేసినట్టు'' ఆమె వైద్యుడు చెప్పారు.